క్లుప్తంగా

కలెక్టరేట్‌లో స్వచ్ఛదివస్

కడప సెవెన్ రోడ్స్: స్వచ్ఛఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులు వారి వారి బ్లాకుల వద్ద 'ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అనే థీమ్ తో క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలన్నింటిని ఆయా శాఖల అధికారులు ఆయా కార్యాలయాల పరిసరాలలో స్వచ్ఛందంగా పార, పలుగు పట్టి పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం అన్ని శాఖల వారు స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. దీంతో బ్లాకు చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో.. సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ పద్మజ, పీఆర్వోలు, ఇంజనీరింగ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన వారోత్సవాలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ అశోక్ తెలిపారు. కడప నగరంలోని బాలాజీనగర్ రోడ్డు నెంబర్ 13లో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, డీఎంహెచ్‌ఓ నాగరాజు, వైవీయూ రిజిస్ట్రార్ పద్మ ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలో గత వారం రోజులకు పైగా కడప మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె కారణంగా కడప నగరం లో అంధకారం , తాగునీటి సమస్య అలుముకున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఇందిరాగాంధీ సర్కిల్, పాత రిమ్స్ వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు చీకట్లో మొబైల్ టార్చ్ లు చూపుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై నిరసన తెలిపారు. ఈ నిరసన లో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయన రహమతుల్లా ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యపై ఐక్యంగా పోరాడుతాం



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పాత కడప దళితులకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తామని, భూమి కోసం వారు నిర్వహించే కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొని వారికి న్యాయం జరిగేంతవరకు కలసి పోరాడుతామని, అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. శనివారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో పాత కడప దళితులకు జరిగిన అన్యాయంపై కలసి పోరాడుదాం రండి.. అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అఖిలపక్ష నాయకులు, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, మాట్లాడుతూ దళితులు అంటేనే వెనుకబడిన వారని, వారికి డబ్బు పలుకుబడి అధికారం అవేవీ ఉండవని దళితుల భూములను ఆక్రమించేస్తే అడిగేవాడే ఉండరనే ఆలోచనతో, పాత కడపకు చెందిన దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. దళితుల పక్షాన ఐక్యంగా పోరాటం ఉధృత స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మడగలం ప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ సిటీ ప్రెసిడెంట్ గౌస్ పీర్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య, ఏపీ ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జహీర్ మౌలానా, ఆర్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ – దౌర్జన్యాలు, అక్రమాలు గ్యారెంటీ



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు , కార్యకర్తలు

- రాబోయే కాలంలో అంతకు అంత వడ్డీతో సహా చెల్లిస్తాం
- కడప నార్త్‌జోన్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: చంద్రబాబు ష్యూరిటీ.. దౌర్జన్యాలు, అక్రమాలు, అన్యాయాలకు గ్యారెంటీగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం మద్రాసురోడ్డులోని ఐఎంఏ హాలులో నార్త్ జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నార్త్‌జోన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాపక్షమేనని తెలిపారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ అప్పులు చేస్తున్నారన్నారు. వెయ్యి రూపాయలు పింఛన్ పెంచి 5లక్షల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. పాలన ఎలా చేయాలో కూటమి నేతలే నేర్పిస్తున్నారని, 2.0లో అన్యాయంగా ప్రవర్తించిన నాయకులు, అధికారులకు సినిమా చూపిస్తామని హెచ్చరించారు. వారు ఎన్ని రకాలుగా వేధిస్తే అంతకు అంత వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి చట్ట పరిధిలో పనిచేయాలన్నారు.

- మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలు సంక్షేమ పథకాలు అమలు చేశాయన్నారు. తల్లికి వందనం లోకేష్ ఆలోచనల నుంచి పుట్టిందని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. డబ్బులు ఉన్నవారు లేనివారికి సాయం చేయాలని పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, లక్షల కోట్లు ఉన్న చంద్రబాబు ఎంతమందిని దత్తత తీసుకోవాలో ప్రజలే ఆలోచించాలన్నారు.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే చుట్టూ ఉన్నవారంతా దొంగలు, దోపిడీదారులే – అంజద్‌బాషా

కడప ఎమ్మెల్యే మాధవి చుట్టూ ఉన్నవారంతా దొంగలు, దోపిడీదారులేనని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆరోపించారు. గత ప్రభుత్వంలో తాము మంజూరు చేయించిన నిధులకు తేదీలు మార్చి కొత్త జీవోలు తెచ్చి మేమే తెచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బుగ్గవంకపై రెండు బ్రిడ్జిలకు రూ.20కోట్లు మంజూరు చేయిస్తే ఇంతవరకూ ఆ పనులు పూర్తి చేయించలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడప నగరపాలక సంస్థకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోయినా ఎవరి సొమ్మని ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తున్నారని ప్రశ్నించారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌ను పిలవకుండా అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పేరు పెద్దగా వేయించుకుంటున్నారని మండిపడ్డారు. అనంతరం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

- ఈ సమావేశంలో కార్పొరేటర్లు పాకా సురేష్, మల్లికార్జున, శివకోటిరెడ్డి, శ్రీలేఖ, డివిజన్ ఇన్‌చార్జులు బండి ప్రసాద్, త్యాగరాజు, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, దాసరి శివ, కిరణ్, సింధు, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

వల్లూరు: ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిన చంద్రబాబు మోసాలను రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిద్దామని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు పీ రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కడప పట్టణంలోని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గంలోని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇవ్వడం , అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబుకు అలవాటైన విద్య అని విమర్శించారు. అవినీతిమయమైన బాబు పాలనతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం ఒకటేమిటి అన్ని రంగాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. 13 నెలల కాలంలోనే ప్రజలు చంద్రబాబు పాలనతో విసిగి పోయారని, ఆయన చేసిన మోసాన్ని గుర్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల నుండి టీడీపీ ప్రజా వ్యతిరేక పాలనపై వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రజల తరుపున పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తేనే మొండి ప్రభుత్వంలో చలనం వచ్చి ప్రజలకు కొంతమేరకైనా ప్రయోజనాలు కలుగుతున్నాయని అన్నారు.

కమలాపురం నియోజకవర్గంలో 21 నుండి రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం–

ఈ నెల 21 వ తేదీ నుండి కమలాపురం నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులు రెడ్డి ఆధ్వర్యంలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ప్రారంభమవుతుందని రవీంద్రనాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 21 వ తేదీ ఉదయం వీరపునాయునిపల్లె మండల పరిధిలోని అనిమెల సమీపంలో వున్న సంగమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు పీ రవీంద్రనాథరెడ్డి

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని ఈగల్ అధికారులు పేర్కొన్నారు. నిషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో శనివారం కడప మునిసిపల్ హైస్కూల్ (మెయిన్)లో యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ కొందరు మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం లోని ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలను విక్రయించే లేదా వినియోగించే వారి వివరాలను పోలీస్ శాఖకు అందించి అలాంటి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. గంజాయి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా పోలీసులకు తెలపాలన్నారు.

నగరంలో శోభాయాత్ర

కడప సెవెన్ రోడ్స్: శ్రీ సత్యసాయిబాబా శత జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కడప నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. రాయచోటి నుంచి కర్నూలుకు వెళుతున్న సత్యసాయి ప్రేమ వాహిని రథాన్ని నగరంలోకి ఆహ్వానించారు. ఎస్‌బీఐ కాలనీ, నబీకోట, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లె, రాజీవ్ పార్క్, ఆర్టీసీ బస్టాండు, వై జంక్షన్, అప్సర సర్కిల్, శంకరాపురం, వన్‌టౌన్, వినాయక నగర్ వరకు శోభాయాత్రను నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ సందా సూర్యప్రకాశ్, శరత్‌బాబు, సాయి కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

కడప అర్బన్: రోడ్డు భద్రత పై ప్రతి శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఇందులోభాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా అవగాహన కల్పించారు.

అక్రమ అరెస్టులతో రాక్షసానందం

– వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాక సురేష్

కడప కార్పొరేషన్: రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వం కుట్రలో భాగమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాక సురేష్ కుమార్ ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్షతో పెట్టిందని, మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసి కూటమి నేతలు తాత్కాలికంగా రాక్షసానందం పొందవచ్చేమోగానీ, కోర్టులో ఈ కేసు నిలబడదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఇలాంటి తప్పుడు కేసులకు వైఎస్సార్‌సీపీలో ఏ ఒక్క నాయ కుడు భయపడే ప్రసక్తే ఉండదన్నారు. ఇది కేవలం చంద్రబాబు, లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా కేసు నడిపిస్తున్నారన్నారు. అధికారంలోకి రావడానికి ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసి ఆ వాగ్దానాలను నిలబెట్టుకోలేక ప్రజల్లో వ్యతిరేకత రావడంతో దాన్నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి తప్పు డు కేసులు పెట్టడం మొదలుపెట్టారన్నారు. కార్య క్రమంలో 40 డివిజన్ కార్పొరేటర్ బాలస్వామి రెడ్డి, నగర కార్యదర్శి రెడ్డి వరకుమార్ పాల్గొన్నారు.

కాన్వకేషన్ విజయవంతానికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ కాన్వకేషన్ విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు కోరారు. శనివారం సాయంత్రం ఆయన వివిధ విభాగాల డీన్లు, విశ్వ విద్యాలయ విభాగాధిపతులు, సమన్వయకర్తలతో తన ఛాంబర్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11, 12,13,14వ కాన్వకేషన్‌కు రాష్ట్ర గవర్నర్ హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కమిటీలలో ఉంటూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ నాలుగు కాన్వకేషన్లలో గౌరవ డాక్టరేట్లు పొందడానికి అర్హత గల ప్రఖ్యాత వ్యక్తులను గుర్తించాలని సూచించారు. అనంతరం పరీక్షల విభాగంలో పనిచేసే వారితో సమావేశమై విద్యార్థుల సర్టిఫికెట్లలో ఎలాంటి దోషాలు లేకుండా ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని, ఏ ఒక్క విద్యార్థి ఇబ్బంది పడకూడదని తెలిపారు. సమావేశంలో కుల సచివులు ఆచార్య పుత్తా.పద్మ , ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్, విశ్వ విద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె ఎస్ వి కృష్ణారావు ,డీన్లు, విశ్వ విద్యాలయ విభాగాధిపతులు పాల్గొన్నారు.



డీన్లు, విశ్వ విద్యాలయ విభాగాధిపతులతో మాట్లాడుతున్న వైవీయూ వీసీ శ్రీనివాసరావు

ఏడో రోజుకు చేరిన సమ్మె



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్పొరేషన్ ఇంజనీరింగ్ కార్మికులు

కడప కార్పొరేషన్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ఏడో రోజుకు చేరింది. శనివారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం రూ.21000 , రూ. 24500 వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత రెండు నెలలుగా అనేక రూపాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే సమ్మెలోకి వెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయభాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్. గోపి, జిల్లా ఉపాధ్యక్షులు కే. తిరుపాల్, సహాయ కార్యదర్శిలు ఆనందరావు, బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు సుంకర రవి, వైఎం. కేశవులు, డ్రైవర్ యూనియన్ నాయకులు కిరణ్, శ్రీరామ్ పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి పోరాటాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలో జరిగిన సీపీఐ నగర 7 వ మహా సభలో నగరాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం సీపీఐ భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు సీపీఐ నగర కార్యదర్శి యస్ వెంకట శివ పేర్కొన్నారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలో సీపీఐ నగర కార్యదర్శి గా తిరిగి ఎన్నికయ్యానని, సహాయ కార్యదర్శిలు గా మద్దిలేటి శంకర్ నాయక్ లు ,21 మంది తో కార్యవర్గం, 63 మందితో కౌన్సిల్ సభ్యుల ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కడప ను స్మార్ట్ సిటీగా గుర్తించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇందులో కేటాయింపులు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకం (యుజిడి) పని పూర్తి చేయాలన్నారు. కడప నగర సమగ్రాభివృద్ధికి పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశం లో సీపీఐ నగర సహాయ కార్యదర్శిలు ఉద్దే మద్దిలేటి, బి.శంకర్ నాయక్, నగర కార్యవర్గ సభ్యులు టక్కోలి మనోహర్ రెడ్డి, బ్రహ్మం, లింగన్న, మునెయ్య,భాగ్యలక్ష్మి, యేసు రత్నం, పకీరప్ప , శివ నాగేంద్ర, శివతేజ , నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించే నైపుణ్యత ఇద్దాం

కడప ఎడ్యుకేషన్: సమాజంలోని సమస్యలు పరిష్కరించే దిశగా కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యం ఇద్దామని , ఆ దిశగా మనందరం ప్రయత్నిద్దాం అంటూ యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆకాంక్షించారు. డిగ్రీ, బి.ఎడ్., బి.పి.ఎడ్. లా విద్యా సంస్థలకు అఫిలియేషన్ ప్రాసెస్ మొదలు పెట్టే ముందు ఆయా విద్యా సంస్థల యజమానులు, ప్రధానాచార్యులతో శనివారం సాయంత్రం విశ్వవిద్యాలయంలోని శ్రీ అన్నమాచార్య సెనెట్ హాల్లో ఉపకులపతి సమావేశమయ్యారు. జాతీయ విద్యా విధానం- 2020 ద్వారా విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఉదహరించారు. విద్యా సంస్థల యజమానులు ప్రధానాచార్యులు నిజాయతీతో పనిచేయాలని, మంచి విద్యను విద్యార్థులకు అందించాలని సూచించారు. కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య రఘు బాబు పాల్గొన్నారు.

22 నుంచి ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చింతకొమ్మదిన్నె: మండలంలోని అన్ని గ్రామాలలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 22వ తేదీ నుంచి ఇంటింటికి తిరిగి కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్‌సీపీ కమలాపురం ఆర్గనైజింగ్ కార్యదర్శి గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చింతకొమ్మదిన్నె మండల కన్వీనర్ గూడా ప్రభాకర రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ నరేన్ రామాంజనేయులరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఉదయం ఏడుగంటలకు చింతకొమ్మదిన్నెలో కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

అపూర్వ కలయిక



కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కే ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కాలేజీలో 1996– 2000 సంవత్సరంలో పట్టభద్రులైన ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆనందంగా సాగింది. ఎక్కడెక్కడో దేశ విదేశాల్లో ఉద్యోగాలలో స్థిరపడిన వారంతా ఈ సమావేశానికి హాజరై ఎన్నో మధురానుభూతులకు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన గురువులకు సన్మానం చేసి వారికి జ్ఞాపికలను అందచేసి వారి నుంచి ఆశీస్సులు స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), కాలేజీ కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ వి ఎస్ ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి ఎస్ ప్రసాద్, అల్యూమిని డీన్ ప్రొఫెసర్ ఎన్ అమర్నాథ్ రెడ్డి, కాలేజీ యాజమాన్యం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా శనివారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామింగ్ ఆఫీసర్ చెప్పాలి రాజారావు, అధ్యాపకులు అబిబుల్లా, శ్రీరాములు రెడ్డి, సుధాకర్ రెడ్డి, చంద్రమౌళి, సుధాకర్ రాజా, యోగేశ్వర్ రెడ్డి, లైబ్రరీ రామసుబ్బయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

– ప్లాస్టిక్ కాలుష్య నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఫర్ మెన్ (అటోనమస్)లో ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డా. రాజేశ్వరి ప్లాస్టిక్ వాడకంతో కలిగే హానికర ప్రభావాల గురించి తెలిపారు. పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ అంకల నాగరాజు, రమేష్ యాదవ్, శివ రామకృష్ణ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ (ఎస్ ఏ ఎస్ ఏ)'లో భాగంగా యోగి వేమన విశ్వవిద్యాలయంలోని అన్ని శాఖల విద్యార్థులు ,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రమదానం చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ ఏ ఎస్ ఏ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె. లలిత, ఎన్ఎస్ఎస్ విశ్వవిద్యాలయ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కామర్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ వై సుబ్బరాయుడు, ఎన్ ఎస్ ఎస్ పిఓలు డాక్టర్ కే శ్రీనివాసరావు, డాక్టర్ సునీత, డాక్టర్ వర ప్రభాకర్, విశ్వవిద్యాలయ పబ్లిక్ రిలేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత , వాలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లలో ×స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ష్

కడప అర్బన్: జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిసరాలలో ×స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివస్ష్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సి.ఐ లు, సిబ్బంది పాల్గొని ఆయా పోలీసు స్టేషన్లు, పరిసరాలను శుభ్రం చేశారు. చీపుర్లు చేత పట్టి చెత్తా చెదారాన్ని ఊడ్చారు. పిచ్చి మొక్కలను తొలగించారు. చిన్న చిన్న గుంతలు పూడ్చారు. పోలీసు స్టేషన్ల ఆవరణ, పరిసరాలలో మొక్కలు నాటి నీరు పోశారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కడప కోటిరెడ్డి సర్కిల్ : స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో శనివారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామనే థీంతో క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించామని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బస్టాండు ఆవరణమంతా ఆయా శాఖల అధికారులతో పార, పలుగు చేతబట్టి పరిసరాలలో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను తొలగించారు. ప్రయాణీకులు ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వస్తువులు పడవేయకుండా బస్టాండు శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వారిచేత స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కడప డీఎం దిలీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు మంజుల, లలిత, గ్యారేజ్ ఇన్‌ఛార్జి కమలేష్, తదితరులు పాల్గొన్నారు.

లంకమల ఆలయంలో స్వచ్ఛ భారత్

స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా లంకమల ఆలయంలో సభ్యులు, వలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మూడు ట్రాక్టర్ల ద్వారా చెత్తను కొత్త చెరువు డంపింగ్ యార్డుకు తరలించారు.



ప్రభుత్వ బాలుర కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



వైవీయూ ఆవరణంలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ పీఓలు, విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం